లక్ష్మీనారాయణ ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజల్లో అర్చకులు, నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సోమవారం శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో విశ్వక్‌సేన హోమం, అనంతరం శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారిని ఊరేగించేందుకు ఏర్పాటు చేసిన రథానికి పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రఘుచారి, వేణుచారి, కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కమిటీ సభ్యులు మధుసూదన్, ప్రమోద్, మహేశ్, వర్మరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, నాగరాజు, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఘట్‌కేసర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి, నియంతృత్వ పోకడలతో రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు పంట రుణమాఫీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం దశాబ్దకాలంగా అభివృద్ధికి పెద్దపీట వేసిందని, దేశంలోని పేదలకు ఐదేళ్లుగా రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తున్న ఘనత మోదీకు దక్కిందన్నారు. మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీగా ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, బాలేశ్, సదానంద్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడాలంటూ వినతి

బోడుప్పల్: చెంగిచర్ల స్లాటర్ హౌజ్ మండి నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి స్థానిక ప్రజలను కాపాడాలంటూ సోమవారం బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు, బోడుప్పల్ కమిషనర్ రామలింగంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలుష్యం వల్ల భూగర్భ జలాలు కలుషితమై విపరీతమైన దుర్వాసనతో పాటు ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మండిలో ఇతర జంతువుల ఎముకలు, జంతు చర్మం వంటి వాటితో ఆయిల్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కర్మాగారం నుంచి విపరీతమైన కాలుష్యం వస్తోందన్నారు. ఈ కాలుష్యం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, చర్మ వ్యాధులు, కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని స్లాటర్ హౌజ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిస్ట్రిక్ గవర్నర్‌గా లయన్ కృష్ణప్రసాద్

ఉప్పల్: జిల్లా క్లబ్ ప్రతినిధుల సమక్షంలో నగరంలో జరిగిన ఎన్నికల్లో డిస్ట్రిక్ 320సి నూతన బాడీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ గవర్నర్‌గా లయన్ వి.కృష్ణప్రసాద్, మొదటి జిల్లా గవర్నర్‌గా కె.ఇన్నారెడ్డి, రెండవ జిల్లా గవర్నర్‌గా కల్లెం కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ గవర్నర్ క్యాబినెట్‌లో 108 మంది సభ్యులను నియమించారు. దాదాపు 34 ఏళ్లుగా లయన్ సేవా ప్రయాణంలో ఈ అరుదైన అవకాశం లభించడంతో లయన్స్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



రాఘవేంద్రనగర్‌లో జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ రాఘవేంద్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ‘ది జిమ్ షార్క్’ జిమ్, ఫిట్నెస్ సెంటర్‌ను ఆయన స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత బిజీ లైఫ్‌తో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారని, అలా కాకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని, తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి జహీర్, జిమ్ నిర్వాహకులు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

- వివాహేతర సంబంధమే కారణమని అనుమానం
- పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు



జగన్(ఫైల్)

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామంతాపూర్ కేసీఆర్ నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంబర్‌పేట పటేల్ నగర్‌లో అన్నోజు జగన్ చారి(52) పద్మావతి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, కార్పెంటర్‌గా పని చేస్తున్న జగన్ కొంత కాలంగా అదే ప్రాంతానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనిని గుర్తించిన అతడి భార్య పద్మావతి పలు మార్లు హెచ్చరించినా, పంచాయితీ పెట్టినా ఫలితం లేక పోయింది. ఈ నెల 14న ప్రియురాలి ఇంటికి వెళ్లిన జగన్ తీవ్ర గాయాలతో ఇంటికి తిరిగి వచ్చాడు. ఏమి జరిగిందని భార్య నిలదీసినా అతను నోరు మెదప లేదు. సోమవారం ఉదయం ప్రియురాలి ఇంటికి వెళ్లిన జగన్ కొద్ది సేపటికే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పద్మావతికి సమాచారం అందింది. దీంతో ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీసినా ఫలితం లేక పోవడంతో ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించింది. తన భర్త మృతికి కారణం అతడి ప్రియురాలే కారణమని ఆరోపిస్తూ ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వేసవి శిక్షణ శిబిరాలతో.. సృజనకు పదును..

- విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు..
- మానసిక ఉల్లాసం, శరీరదారుఢ్యానికి క్రీడలు
- 10 శిబిరాల కోసం జిల్లాకు రూ.1.05 లక్షలు
- కోచ్‌ల ఎంపికకు సిద్ధమవుతున్న అధికారులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థులు.. ఉదయం నిద్ర లేచింది మొదలు పుస్తకాలతో కుస్తీ పడుతూ.. పరీక్షల భయంతో.. వారికి ఇష్టమైన ఆటలకు సమయం కేటాయించలేకపోతున్నారు. వేసవి సెలవులు వస్తుండటంతో ఈ సమయంలో వారికి ఇష్టమైన ఆటల్లో తర్ఫీదు పొందడంతో పాటు అందులో రాణించడానికి అవకాశం దొరకనుంది. మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యానికి, స్నేహభావం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలోనే పాఠశాల స్థాయిలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు గ్రామస్థాయిలో క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం పూనుకుంటోంది. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు నిధులను కూడా కేటాయించింది. 32 జిల్లాలకు నిధులను కేటాయిస్తూ.. గత నెల 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మే 1 నుంచి 31 వరకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది.

వేసవి శిక్షణ శిబిరానికి రూ.1.05 లక్షలు

వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యువజన సర్వీసులు క్రీడల శాఖకు రూ.1.05 లక్షలు సర్కారు కేటాయించింది. జిల్లా పరిధిలోని పది వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు మొత్తం రూ.40 వేలు కేటాయించగా, క్రీడా సామాగ్రి కొనుగోలుకు రూ.50 వేలు, క్రీడా మైదానాల అభివృద్ధి, రూ.10 వేలు, క్రీడల సమయంలో ఏదైనా ప్రమాదం జరగడం, క్రీడాకారులకు గాయాలైతే చికిత్స అందించేందుకు రూ.5 వేలు కేటాయించారు.

కోచ్ ఎంపికకు చర్యలు..

శిక్షణ శిబిరాల నిర్వహణలో కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం. వారిని ఎంపిక చేసేందుకు జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి చర్యలు తీసుకుంటున్నారు. మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు కొనసాగనుండగా.. ఈలోపే కోచ్‌లను ఎంపిక చేసి, క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలపై చర్యలు తీసుకుంటారు.

మార్గదర్శకాలు

శిబిరాల నిర్వహణకు సంబంధిత శాఖ కొన్ని మార్గదర్శకాలను రూపొందించారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ పర్యవేక్షణలో శిక్షణ శిబిరాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా కబడ్డీ, తైక్వాండో, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడలకు సంబంధించి 10 శిబిరాలు నిర్వహించేందుకు అవకాశముంది. ఒక్కో శిబిరంలో 20 నుంచి 30మంది విద్యార్థులు మాత్రమే ఉండాల్సి ఉంటుంది. క్రీడా శిక్షణ శిబిరం నిర్వహణలో భాగంగా ఉదయం, సాయంత్రం మాత్రమే శిక్షణ ఉంటోంది. 11 ఏళ్ల లోపు బాలబాలికలకు ప్రవేశం ఉంటోంది.

వేసవి క్రీడాశిక్షణ శిబిరాలకు ఏర్పాట్లు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వివిధ క్రీడలకు సంబంధించి మొత్తం 10 శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానించడంతో పాటు కసరత్తు చేస్తున్నాం. ఏప్రిల్ నెలాఖరులోపు ఈ ప్రక్రియ పూర్తి చేసి, వేసవి శిబిరాలను మే నుంచి ప్రారంభిస్తాం.

- బలరామారావు, జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి

గంగపుత్రుల సంక్షేమం కోసం కృషిచేస్తాం



సాయికుమార్‌ను సత్కరిస్తున్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు

బోడుప్పల్: గంగపుత్రుల సంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర మత్స్య సహకార సంఘం సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బోడుప్పల్ గణేష్‌నగర్ కాలనీలోని గంగపుత్ర భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగపుత్ర సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, గంగపుత్ర కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కూర బాలరాజ్, ప్రధాన కార్యదర్శి బంగారి కొమరయ్య, కోశాధికారి నాగుల లింగమూర్తి, ఉపాధ్యక్షుడు జగన్నాథం, ప్రభాకర్, అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న సుజాత గుప్తా

అల్వాల్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా అన్నారు. ఆల్వాల్ మండల ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సోమవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండే ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగినప్పుడే గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ సహకారంతో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి ఇబ్బందులున్నా పరిష్కరించడానికి ముందుంటానని ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మునీందర్‌గుప్తా మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూనే సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా మంచాల రవీంద్రగుప్తా, ప్రధాన కార్యదర్శిగా గుండా జగ్గయ్య, కోశాధికారిగా ఉప్పల నరేందర్, ఉపాధ్యక్షుడిగా ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, నాగమల్లి మల్లేశం తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

రెవెన్యూ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి పరిధిలోని సర్వే నంబర్ 331/1, 2, 352, 364/1, 2, 365/1, 2లలో గల 29 ఎకరాల 24 గుంటల భూమి విషయంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి కీసర డివిజన్ ఆర్‌డీఓ, మేడ్చల్ తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎనాక్యూప్రాపర్టీ, వారసులు లేని భూమి కావడంతో ప్రభుత్వానికి చెందాల్సిన భూములపై లోకాయుక్త, హైకోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చి అన్యాక్రాంతం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్‌డీఓ కార్యాలయంలో గతంలో పనిచేసిన వారు, మేడ్చల్ తహసీల్దార్లుగా పనిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

సీతారామ కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు

బోడుప్పల్: ఈ నెల 17వ తేదీన బోడుప్పల్ వాసవినగర్ కాలనీలో జరగనున్న శ్రీసీతారామ చంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు ఏర్పాటు చేస్తున్నట్లు వాసవినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం ఉదయం 11.11 గంటలకు వాసవినగర్ కాలనీలో(గుడి ఆవరణంలో) ఈ కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామని, అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే రాత్రి 7గంటలకు తిరువీధి సేవ(ఊరేగింపు) కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అనురాగ్ స్కూల్‌లో విషు వేడుకలు

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ స్కూల్ విషు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు ప్రజలు ఉగాది వేడుకను జరుపుకునే మాదిరిగా మలయాళ ప్రజలు విషు పండుగను నూతన సంవత్సర వేడుకగా జరుపుకుంటారు. మలయాళ కేలండర్ ప్రకారం విషు పండుగ సోమవారం దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. కేరళలోని స్థానిక ప్రజలు విషును జరుపుకుంటారు. ఈ పండగ శ్రేయస్సును సూచిస్తుంది. విషు అంటే సమానం అని అర్థం. ఈ పండగను అనురాగ్ స్కూల్‌లో సోమవారం ఉదయం కన్నయ్య పూజతో వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ విద్యార్థులు, తల్లిదండ్రులకు విషు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం షడ్రుచుల శాఖాహార సామూహిక భోజనాలు చేశారు.



ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

శామీర్‌పేట్: ద్విచక్రవాహనం అదుపు తప్పి వాహనదారుడు మృతి చెందిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. మేడ్చల్ మున్సిపల్ పరిధి, కిష్టాపూర్ గ్రామానికి చెందిన భిక్షపతి(45), మేడ్చల్ మున్సిపాలిటీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ములుగులో తన కూతురు ఇంటికి వెళ్లి సోమవారం సాయంత్రం తిరిగి వస్తుండగా శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్ గ్రామ పరిధిలో వేంకటేశ్వరస్వామి గుట్ట సమీపంలో తన బైక్ అదుపు తప్పి పడటంతో భిక్షపతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. తీవ్రగాయాలైన అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు.

18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నందున నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వర్తించాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో మేడ్చల్ డీసీపీ నితిక పంత్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి నోడల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల విధులు ఎంతో జాగ్రత్తగా చేపట్టాలని ఆయన సూచించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను సంబంధిత నోడల్ అధికారులతో చర్చించారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఉంటుందన్నారు. లోకసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు 100 మీటర్ల దూరం వరకు వాహనాలను అనుమతించడం జరుగుతుందన్నారు. మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఆన్‌లైన్‌తో సహా, సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల తనిఖీల్లో రూ.4.78 కోట్ల నగదు పట్టివేత

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.4,78,71,931 నగదు సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఇందులో 83,94,655 విలువ కలిగిన ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్స్ పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ బృందాలు నిరంతరం నిఘా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే, 4,802 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకోవడంతో పాటు 312 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో 326 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 23 బెల్ట్ షాపులను క్లోజ్ చేశామన్నారు. పోలీస్ శాఖ ద్వారా 897 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించామన్నారు. 472 సీఆర్‌పీఎఫ్ ద్వారా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 753 మందిని బైండోవర్ చేశారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 59 ఫిర్యాదులు రాగా, 37 గ్రీవెన్స్ ధ్రువీకరణ డాక్యుమెంట్స్‌తో రూ.2,86,53,450 విలువ గల ఆభరణాలు విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గుండ్లపోచంపల్లిలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

మేడ్చల్: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డికి ఓటు వేయాలంటూ కాంగ్రెస్ పట్టణ నాయకులు సోమవారం ప్రచారం ప్రారంభించారు. పట్టణంలోని కింది బస్తీ పోచమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పట్టణ వీధుల్లో ఊరేగించారు. వీధుల వెంట దుకాణాల్లో, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గర్దాస్ నరేందర్, బాలమల్లేష్, లాయక్ అలీ, లింగం, వెంకటేష్, నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ శివకుమార్, పవన్ కుమార్, ఆంజనేయులు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి ఓటు వేయాలంటూ పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించి ఓటర్లను వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచులు భేరి ఈశ్వర్, కృష్ణారెడ్డి, కందాడి నరేందర్‌రెడ్డి, నాయకులు రాజేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో కాంగ్రెస్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ఆరు హామీలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు మశ్చేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ సంగీత, రెండో వార్డు అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మేడ్చల్‌రూరల్: పేకాటరాయుళ్లు వేర్వేరు ప్రదేశాల్లో పేకాట శిబిరం ఏర్పాటు చేసుకొని పేకాట ఆడుతుండగా మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న మందితో పాటు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణ వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని సూర్యనగర్ కాలనీలో ఓ ఇంట్లో ఆదివారం రాత్రి పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీలకు చెందిన ఏజిర్ల కామేశ్, కొండేటి దుర్గాప్రసాద్, జీడుగపల్లి అశోక్, ఎలివెల రామకృష్ణ, బుర్రా కొండయ్య, పోలసాని ధనుంజయరెడ్డి, మలినేని వీరస్వామి తదితర ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.40,400 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు.

మరో ఘటనలో..

పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓ ఇంట్లో పేకాట రాయుళ్లు పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారంతో శిబిరంపై దాడులు నిర్వహించిన ఎస్‌ఓటీ పోలీసులు పట్టణానికి చెందిన యూసఫ్, ఆనంద్ కుమార్, తలారి మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, ఖాజా ఖలీలుద్దీన్, వికాస్ కుమార్, రాము తదితర ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.84 వేల నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ కృషితో బలమైన ఆర్థిక వ్యవస్థ



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న ఈటల



మధురానగర్‌కాలనీలో చంద్రారెడ్డి తదితరులు



మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

ఘట్‌కేసర్: ప్రపంచంలో భారత ఆర్థిక వ్యవస్థను నరేంద్ర మోదీ ప్రభుత్వం 11వ స్థానం నుంచి 5వ స్థానంలో నిలిపిందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపాలిటీలోని గురుకుల్ కళాశాల ఆవరణలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీపీ దాసుగౌడ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులను సోమవారం కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సనాతన ధర్మం ప్రమాదంలో పడిందని, దీన్ని రక్షించే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామతీర్థ, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, బాల్‌రాజ్‌ముదిరాజ్, కోటేశ్వరావు, శేఖర్‌గుప్తా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి

కీసర: మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం బీజేపీ మహిళా మోర్చా నేతలు కృషి చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని మధురానగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 9 ఏళ్ల కాలంగా మహిళా సంక్షేమం కోసం చేపట్టిన వివిధ పథకాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళలంతా బీజేపీకి ఓట్లు వేసే విధంగా చూడాలన్నారు. అనంతరం వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓట్లు వేయాలని కోరారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాగారం అధ్యక్షుడు వేణుగోపాల్, నేతలు నక్క కిషోర్, రాకేష్, జంగారెడ్డి, అక్కాల సురేష్, సూర్యశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

మేడ్చల్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలంటూ బీజేపీ పట్టణ, మండల నాయకులు సోమవారం మున్సిపల్ వార్డుల్లో, గ్రామాలలో ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి ప్రచారం నిర్వహించారు. నాయకులు నరేందర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్ జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.